సాక్షి
అనకాపల్లి
సోమవారం । 29 । జనవరి । 2024



అప్పన్నకు ఆర్జిత సేవలు

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. అనంతరం నిత్యకల్యాణం నిర్వహించారు 8లో



పోస్టుమార్టం కష్టాలకు మోక్షం

పోస్టుమార్టం కష్టాలకు త్వరలో మోక్షం కలగనుంది. రూ.35 లక్షలతో చోడవరంలో మార్చురీ భవనం నిర్మిస్తున్నారు. 8లో



సరియా.. సురక్షితం

సరియా జలపాతం వద్ద జరుగుతున్న ప్రమాదాలకు పోలీసుశాఖ చెక్ పెట్టింది. పర్యాటకుల ప్రాణాలకు భద్రత కల్పించింది. 8లో

న్యూస్‌రీల్

30న యలమంచిలిలో మినీ జాబ్‌మేళా

అనకాపల్లి: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో యలమంచిలి ఎస్‌జీఏ డిగ్రీ కళాశాలలో ఈనెల 30న మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. డెక్కన్ ఫైన్ కెమికల్స్, ఐసీఎస్ టీపీలలో ఉద్యోగాల నియామకానికి ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. డిగ్రీ(కెమిస్ట్రీ)చదువుకున్న 27 సంవత్సరాల లోపు యువకులు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాలకు 8309561123, 7036363272 అనే ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

తత్కాల్‌లో ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లింపునకు తుది గడువు నేడు

అనకాపల్లి: ఈ ఏడాది మార్చిలో జరిగే ఇంటర్మీడియెట్ పరీక్షలకు హాజరయ్యే రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు తత్కాల్ కింద రూ.3వేల అపరాధ రుసుంతో ఫీజును సోమవారం సాయంత్రం 4 గంటల్లోగా చెల్లించవచ్చని ఇంటర్మీడియెట్ ఒకేషనల్ జిల్లా అధికారి బి.సుజాత ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఫీజు చెల్లించే విద్యార్థులు దగ్గరలో గల కళాశాలల ప్రిన్సిపాళ్లను సంప్రదించాలని ఆమె పేర్కొన్నారు.

రేపు విశాఖకు క్రికెటర్ల రాక

విశాఖ స్పోర్ట్స్: రెండో టెస్ట్ కోసం భారత్,ఇంగ్లండ్ జట్ల ఆటగాళ్లు మంగళవారం విశాఖ చేరుకోనున్నారు. ఆ రోజు మధ్యాహ్నం 2.10 గంటలకు హైదరాబాద్‌లో బయలుదేరి విశాఖ విమానాశ్రయానికి చేరుకోనున్నారని ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్.ఆర్.గోపినాథరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన స్టేడియంలో ఏర్పాట్లను ఆదివారం పర్యవేక్షించారు. స్టేడియం పరిసర ప్రాంతాల్లో పోలీసుల సమన్వయంతో అవసరమైన భద్రతపరమైన చర్యలకు మ్యాచ్ నిర్వాహక కమిటీ, సిబ్బంది సహకరించాలని ఆదేశించారు. విశాఖలోని ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో ఈ మ్యాచ్ ఫిబ్రవరి 2వ తేదీ నుంచి 6వ తేదీ వరకు జరగనున్న విషయం విదితమే. ఇప్పటికే ఈ మ్యాచ్‌కు సంబంధించి ఆన్‌లైన్‌తో పాటు కౌంటర్ల ద్వారా టికెట్ల విక్రయాన్ని చేపట్టామన్నారు. ప్రతి రోజు రెండు వేల మంది విద్యార్థులకు వారి విద్యాసంస్థ గుర్తింపు కార్డుతో ఉచిత ప్రవేశం కల్పించనున్నామన్నారు.


27న మోదకొండమ్మ తీర్థ మహోత్సవం



మాడుగుల: ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ తీర్థమహోత్సవాన్ని వచ్చే నెల 27న నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆదివారం నిర్వహించిన ఆలయ కమిటీ సమావేశంలో ఏర్పాట్లపై చర్చించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలుచేపట్టనున్నారు. ఎడ్ల పరుగు పోటీతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు దంగేటి సూర్యారావు, శ్రీనాథు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సరిహద్దులో అప్రమత్తం

ఏఎస్పీ అదిరాజ్ సింగ్ ఆదేశం



కృష్ణదేవిపేట పోలీసు స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న ఏఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా

గొలుగొండ: త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో జిల్లా సరిహద్దులో పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని నర్సీపట్నం ఏఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా ఆదేశించారు. కృష్ణదేవిపేట పోలీసు స్టేషన్‌ను ఆదివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. కేసుల వివరాలను ఎస్ఐ ఉపేంద్రను అడిగి తెలుసుకున్నారు. అల్లూరి, అనకాపల్లి సరిహద్దు ప్రాంతమైన కృష్ణదేవి పేటలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. నగదు, మద్యం రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలని ఎస్ఐకి సూచించారు. ఆయన వెంట నర్సీపట్నం రూరల్ సీఐ హరి , టౌన్ సీఐ గణేష్ ఉన్నారు.

సప్త పర్యాటకం

వేద, పురాణ, ఇతిహాసాల ప్రకారం 'సప్త' సంఖ్యకు అత్యంత ప్రాధాన్యత ఉంది. ఇదే కాకుండా ఏడు అంకెకు ఎన్నో విశిష్టతలున్నాయి. పర్యాటక పరంగా జిల్లాలో ఇప్పుడు ఏడు ప్రాంతాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. వాటిపై కేంద్ర పర్యాటక శాఖ సర్వే జరుపుతోంది. పర్యాటక శాఖ గుర్తింపు లభిస్తే ఆ ప్రాంతాల ఆధునికీకరణపై ప్రత్యేక దృష్టి సారిస్తారు.

- బెస్ట్ టూరిజం విలేజ్‌పై జోరుగా సర్వే
- జిల్లాలో ఏడు పర్యాటక కేంద్రాల నుంచి దరఖాస్తులు
- ఇప్పటికే పలు కేటగిరీల్లో వివరాల సేకరణ
- మౌలిక వసతులు, ఆధునికీకరణపై పర్యాటక శాఖ ప్రత్యేక దృష్టి



పంచదార్లలో పుణ్యస్నానం



మాడుగుల హల్వా



ఏటికొప్పాక వద్ద సర్వే చేస్తున్న ఉద్యోగి

అచ్యుతాపురం: ప్రపంచం అంతా పర్యాటకం వైపు చూస్తోంది. ఒత్తిడి తగ్గి, మానసిక ఉల్లాసం పొందాలంటే కచ్చితంగా ఉపశమనాన్ని అందించే పర్యాటక ప్రాంతాలను సందర్శించాల్సిందే. దీంతో పర్యాటక రంగం ప్రాధాన్యం పెరిగింది. అంతర్జాతీయ స్థాయిలోనే పర్యాటక రంగంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. ఒక్కో పర్యాటక ప్రాంతానికి ఒక్కో విశిష్టత ఉంటుంది. వారసత్వ సంపదగానూ, ఎకో టూరిజంగానూ, పురావస్తు పరంగానూ, సుందర దృశ్యాల పరంగానూ, ఆధ్యాత్మికంగానూ ప్రత్యేకత కలిగి ఉంటాయి. జిల్లాలోని ఏడు ప్రాంతాలు పర్యాటక పరంగా ప్రత్యేకతను చాటుకుంటున్నాయి. ఆయా ప్రాంతాలపై సర్వే జరుగుతోంది.

భారత ప్రభుత్వ పర్యాటక శాఖకు ఏడు దరఖాస్తులు

జిల్లాలో బొజ్జన్నకొండ, కొండకర్ల ఆవ, మాడుగుల, రేవుపోలవరం, తంతడి, పంచదార్ల, ఏటికొప్పాక తరఫున ఏడు దరఖాస్తులు భారత ప్రభుత్వ పర్యాటక శాఖకు వెళ్లాయి.రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పర్యాటక ప్రాంతంగా గుర్తించే మౌలిక సదుపాయాలు ఇక్కడ ఉన్నాయా లేవా అనే అంశంపై సర్వే జరుగుతోంది.బొజ్జన్న కొండ బౌద్ధారామాలు, కొండకర్ల ఆవలో విదేశీ పక్షుల సందడి, పంచదార్ల వద్ద కొండల నుంచి వచ్చే జలపాతాలు, మాడుగుల హల్వా, రేవుపోలవరం, తంతడి సముద్ర తీర అందాలు, ఏటికొప్పాక లక్కబొమ్మల తయారీ వంటి ప్రత్యేకతలపై సర్వే బృందం ఇప్పటికే పలు కేటగిరీల్లో వివరాలు సేకరించింది. రహదారి సౌకర్యం,రాత్రి వేళల్లో బస ఉండేందుకు అవకాశాలు,అందుబాటులో నాణ్యమైన ఆహారం,ఆకట్టుకునే దృశ్యాలు, పర్యాటకులకు కల్పించే రక్షణ,పార్కింగ్ సదుపాయం వంటి అనేక అంశాలపై ఆరా తీసింది ఆ బృందం.


పర్యాటకుల తాకిడి ఇలా...

జిల్లాలోని పర్యాటక ప్రాంతాల్లో భాగంగా బొజ్జన్న కొండను వారసత్వ,ఆధ్యాత్మిక కేంద్రంగా గుర్తించారు.రోజుకు సరాసరిన 100 మంది ఇక్కడికి సమీపంలోని పరిసరాల్లో పర్యాటకులు బస చేస్తున్నారు. కొండకర్ల ఆవ వద్ద ఆసక్తి దృశ్యాలు, విదేశీ పక్షుల సందడి ఉండగా, పది వేల మంది ఈ ప్రాంతాల్లో పర్యటిస్తున్నట్టు గుర్తించారు. ఆయా కేటగిరీల్లో మౌలిక సదుపాయాలు, వనరులు, పర్యాటకుల తాకిడి మేరకు ఇచ్చే నివేదిక అనంతరం ఏడు పర్యాటక ప్రాంతాలకు తుది గుర్తింపు రానుంది. గుర్తింపు లభిస్తే ఈ ప్రాంతాలకు పర్యాటకంగా మరిన్న హంగులు సమకూరుతాయి. వీటి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తారు.

ఏడు ప్రాంతాలపై సర్వే

జిల్లాలోని ఏడు ప్రాంతాలపై సర్వే జరుగుతోంది. వారసత్వం,ఆధ్యాత్మికం, ఆసక్తికర,సుందర దృశ్యాలు వంటి అనేక కేటగిరీల్లో సర్వే జరుగుతోంది.త్వరలోనే దీనికి సంబంధించి నివేదిక రానుంది.కాగా బొజ్జన్న కొండ వద్ద రూ.7.43 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతుండగా, మరో రూ.70 లక్షలతో పలు చోట్ల పర్యాటకంగా పనులు నిర్వహించేందుకు ప్రతిపాదనలో ఉన్నాయి.


-మహేష్, జిల్లా పర్యాటక శాఖ అధికారి



బొజ్జన్న కొండపై చైత్యాలు



కొండకర్ల ఆవలో బోటులో షికారు చేస్తున్న పర్యాటకులు



తంతడి తీరంలో షూటింగ్ సెట్



రేవుపోలవరం సముద్ర తీరం

బొజ్జన్నకొండ వద్ద లైటింగ్, సౌండ్ షో

- శరవేగంగా పనులు
- ఎంపీ బి.వి.సత్యవతి



బొజ్జన్నకొండ లైటింగ్, సౌండ్ షోను తిలకిస్తున్న ఎంపీ సత్యవతి

తుమ్మపాల: బొజ్జన్నకొండ వద్ద లైటింగ్, సౌండ్ షో ఏర్పాటు పనులను బెల్జియం దేశానికి చెందిన ఏజెన్సీ చేపడుతోందని, రెండు వేల ఏళ్ల చరిత్ర కలిగిన బొజ్జన్న కొండకు సంబంధించి అంశాలతో ప్రత్యేక షో ఏర్పాటు పనులు జరుగుతున్నాయని ఎంపీ బి.వి.సత్యవతి తెలిపారు. మండలంలో శంకరం గ్రామంలో బొజ్జన్నకొండ వద్ద ఆదివారం బెల్జియం దేశానికి చెందిన ఓ ఏజెన్సీ ప్రాజెక్టర్ ద్వారా ఏర్పాటుచేసిన లైటింగ్, సౌండ్ షోను ఆమె తిలకించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం మంజూరు చేసిన రూ.7.3 కోట్లతో చేపట్టిన ఈ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేయడంతో పాటు ఆధ్యాత్మిక కేంద్రంగా బొజ్జన్నకొండను తీర్చిదిద్దేందుకు అన్నివిధాలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. జిల్లా ముఖద్వారంగా ఉన్న ఈ ప్రాంతానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధన్యం ఇస్తున్నారని, రాబోయే రోజుల్లో ఇక్కడ జరిగే అభివృద్ధితో పూర్తిగా ఈ ప్రాంతం రూపురేఖలు మారనున్నాయని చెప్పారు. బుద్ధుని జీవిత విశేషాలతో చరిత్రను జోడించి ఇక్కడ లైటింగ్, సౌండ్‌షో ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. బుద్ధుని ధ్యానమందిరం, పార్కింగ్, టూరిస్టుల ఫెసిలిటేషన్ కేంద్రం, రెస్టారెంట్ అన్నిరకాల సౌకర్యాలతో ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. బుద్ధుని కొండ, లింగాల కొండ విశిష్టతతో పూర్తిస్థాయిలో షో జరుగుతుందన్నారు. ఇందుకోసం 1.64 ఎకరాల స్థలాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కేటాయించారని చెప్పారు. అభివృద్ధి పనుల అనంతరం స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. విశాఖ పర్యాటనలో బొజ్జన్నకొండ ఓ భాగం కానున్నదన్నారు. ఈ కార్యక్రమంలో బెల్జియం సంస్థ ప్రతినిధులు, డాక్టర్ విష్ణుమూర్తి, తుమ్మపాల సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, పసుపులేటి లక్ష్మి, రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు పడాల గణపతి, పీడీ గాంధీ, కె.ఎం.నాయుడు, మంత్రి సత్తిబాబు, కోట చిన్నా పాల్గొన్నారు.

నేటి నుంచి ఏపీఈఆర్సీ ప్రజాభిప్రాయ సేకరణ

విశాఖ కేంద్రంగా విద్యుత్ చార్జీల ప్రతిపాదనపై విచారణ

సాక్షి, విశాఖపట్నం: ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్సీ) ఆధ్వర్యంలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు విశాఖలోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం నుంచి జరగనుంది. వర్చువల్ విధానంలో ఏపీఈఆర్సీ నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణకు అవసరమైన ఏర్పాట్లను ఏపీఈపీడీసీఎల్ ఇప్పటికే పూర్తి చేసి ఆదివారం ట్రయల్ రన్ నిర్వహించింది. ఈ ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొనేందుకు ఏపీఈఆర్సీ అధికారులతో పాటు ఆంధ్రప్రదేశ్ ఇంధనశాఖ, ఏపీట్రాన్స్‌కో, ఏపీజెన్‌కో, సీపీడీసీఎల్, ఎస్పీడీసీఎల్ ఉన్నతాధికారులు ఆదివారం సాయంత్రం నగరానికి చేరుకున్నారు. ఏపీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ సి.వి.నాగార్జునరెడ్డి, సభ్యులు ఠాకూర్ రామసింగ్, పి.వి.ఆర్.రెడ్డి ఆధ్వర్యంలో విద్యుత్ సంస్థల ప్రతిపాదనలకు సంబంధించిన సూచనలు, అభ్యంతరాలు, అభిప్రాయాలను వీడియో కాన్ఫరెన్స్(వర్చువల్) ద్వారా స్వీకరిస్తారు. ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొని విద్యుత్ పంపిణీ సంస్థల ఛార్జీల ప్రతిపాదనలపై 63 మంది, ఏపీజెన్‌కో ప్రతిపాదనలపై 8 మంది మొత్తంగా 71 మంది అభిప్రాయాలను తెలియచేసేందుకు దరఖాస్తు చేసుకున్నారు. సోమవారం 17 మంది, మంగళవారం 23 మంది, బుధవారం 23 మంది, గురువారం 8 మంది ఈ కార్యక్రమంలో పాల్గొని అభిప్రాయాలను తెలియచేస్తారు. ముందుగా పేర్లు నమోదు చేసుకోనివారు రాష్ట్రంలోని తమ సమీప విద్యుత్ పర్యవేక్షణ ఇంజినీరు (ఎస్ఈ), ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు (ఈఈ) కార్యాలయాల్లో సంప్రదించి ఏపీఈఆర్సీ అనుమతితో ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొనవచ్చు. రోజూ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, తిరిగి 2 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు జరగనున్న ఈ కార్యక్రమాన్ని ప్రజలు htt pr://www.apeartempower.com/ apercpubichearinf వెబ్ లింక్ ద్వారా ప్రత్యక్ష ప్రసారాన్ని(లైవ్ స్ట్రీమింగ్) వీక్షించే అవకాశాన్ని కల్పించామని ఏపీపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు.

గురుకులం పిలుస్తోంది!

- పేదవర్గాలకు ఉచిత వసతితో కూడిన విద్య
- సీబీఎస్ఈ బోధనతో గురుకుల చదువులకు క్రేజ్
- పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణతో రాణిస్తున్న విద్యార్థులు
- 2024-25 విద్యా సంవత్సరానికి నోటిఫికేషన్ జారీ
- 5వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశం



విశాఖలోని శ్రీకృష్ణపురం గురుకులం



ఐఎఫ్‌పీ ప్లాట్ ప్యానల్‌పై పాఠ్యాంశాల బోధన



విద్యార్థులకు భద్రత ఇచ్చేలా సీసీ కెమెరాల పర్యవేక్షణ

విశాఖ విద్య: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులాల్లో ప్రవేశం పొందేందుకు సమయం ఆసన్నమైంది. 5వ తరగతి, ఇంటర్మీడియట్‌లో చేరేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర సామాజిక వర్గాలకు చెందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. గురుకులాల్లో ఉచిత వసతి కల్పించి, కార్పొరేట్‌కు దీటుగా విద్యాబోధన అందిస్తున్నారు. గతేడాది నుంచి సీబీఎస్ఈ సిలబస్ బోధన సాగుతుండటంతో గురుకులాల్లో అడ్మిషన్లు పొందేందుకు విద్యార్థులు మరింత ఆసక్తి చూపుతున్నారు. రుచికరమైన పౌష్టికాహారం, విద్యాలయ ప్రాంగణంలో సీసీ కెమెరాల పర్యవేక్షణ, ఇంటర్మీడియట్ స్థాయిలో ఐఐటీ, జేఈఈ వంటి పోటీ పరీక్షలకు సైతం ప్రత్యేక శిక్షణ నిర్వహిస్తుండటంతో.. వీటిలో సీటు దక్కించుకునేందుకు విద్యార్థులు పోటీపడుతున్నారు.

సీట్ల రిజర్వేషన్ ఇలా..

ఎస్సీ–75 శాతం, ఎస్సీ–కన్వర్టడ్ క్రిస్టియన్(బీసీ-సీ)–12 శాతం, ఎస్టీ–6 శాతం, బీసీ–5 శాతం, ఓసీ -2 శాతం చొప్పున సీట్లు కేటాయించారు. ఎస్సీ గురుకులాల్లో చదివిన విద్యార్థులతో 60 శాతం సీట్లు, మిగతా 40 సీట్లు ఇతర స్కూళ్లలో చదివిన విద్యార్థులతో భర్తీ చేస్తారు.

ఇదీ షెడ్యూల్

ఈ నెల 25న నోటిఫికేషన్ జారీ అయింది. ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు ఫిబ్రవరి 23 వరకు గడువు ఉంది. మార్చి10న ఉదయం10 నుంచి 12గంటల వరకు 5వ తరగతిలో ప్రవేశాలకు, మధ్యాహ్నం 2 నుంచి 4.30గంటల వరకు ఇంటర్మీడియట్ ప్రవేశానికి ప్రవేశ పరీక్ష ఉంటుంది. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన కామన్ ఎంట్రన్స్ టెస్టులో మంచి మార్కులు సాధించిన వారి జాబితాను ప్రకటించి, మెరిట్ ఆధారంగా సీట్లు భర్తీ చేస్తారు.

- అనకాపల్లిలో బాలురు దేవరాపల్లి, గొలుగొండ, సబ్బవరం, బాలికలు నక్కపల్లి, కోనాం, నర్సీపట్నం, తాళ్లపాలెం, కొక్కిరాపల్లి గురుకులాల్లో అడ్మిషన్లు పొందవచ్చు. ఒక్క సబ్బవరంలో మాత్రం ఎంఈసీ, సీఈసీలో 40 చొప్పున సీట్లు ఉండగా, మిగతా అన్ని కాలేజీల్లోనూ ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో 40 చొప్పున సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఐదో తరగతిలో 80 మంది చొప్పున అవకాశం ఉంది.
- విశాఖపట్నం జిల్లా పరిధిలో శ్రీకృష్ణాపురం(బాలురు), మేహాద్రి గెడ్డ(బాలికలు), మధురవాడ(బాలికలు)లో గురుకుల విద్యాలయాలు ఉన్నాయి. ఒక్కో గురుకులంలో 5వ తరగతిలో 80 సీట్లు, ఇంటర్‌లో బైపీసీ–40, ఎంపీసీ–40 సీట్ల చొప్పున ఉన్నాయి.

అర్హతలివీ..

5వ తరగతిలో ప్రవేశానికి ఎస్సీ, ఎస్టీ విద్యార్థులైతే 2011 సెప్టెంబర్ ఒకటి నుంచి 2015 ఆగస్టు 31 మధ్య, ఓసీ, బీసీ, ఎస్సీ(కన్వర్టడ్ క్రిస్టియన్) విద్యార్థులు 2013 సెప్టెంబర్ ఒకటి నుంచి 2015 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి. 3, 4 తరగతులు గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదివి ఉండాలి. ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి 2023–24 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. 2024 ఆగస్టు 31 నాటికి 17 సంవత్సరాలు వయసు మించకూడదు. ఎస్సీ గురుకులాల్లో చదువుకున్న విద్యార్థులకైతే ఒక ఏడాది సడలింపు ఇస్తారు. విద్యార్థి తల్లిదండ్రుల ఆదాయం ఏడాదికి రూ.లక్ష ఉండాలి.ఐదో తరగతి ప్రవేశానికి http://apgpcet.apcfss.in, ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి http://apgpcet.apcfss.in/inter వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ



విద్యార్థులకు నాణ్యమైన చదువులు అందించడమే లక్ష్యంగా.. ప్రతి ఒక్కరిపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకుంటాం. చదువులతో పాటు, ఇతర అంశాల్లోనూ రాణించేలా తర్ఫీదు ఇస్తాం. మా విద్యార్థులు వివిధ పోటీ పరీక్షల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చాటారు. ఉపాధ్యాయులంతా సమన్వయంతో పనిచేస్తున్నాం.

-వి.రత్నవల్లి, ప్రిన్సిపాల్, శ్రీకృష్ణపురం

సద్వినియోగం చేసుకోవాలి



గురుకులాల్లో అడ్మిషన్లకు గతంలో కన్నా.. ఇప్పుడు పోటీ ఉంది. విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యమిచ్చేలా అన్ని గురుకులాల్లో సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంది. ఐదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు అర్హులైన, ఆసక్తి ఉన్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– రూపవతి, బీసీ గురుకుల సొసైటీ కన్వీనర్, ఉమ్మడి విశాఖ జిల్లా

బీచ్‌లో 'మిస్ పర్ఫెక్ట్' సందడి

ఏయూక్యాంపస్: సినీనటి లావణ్య త్రిపాఠి ఆదివారం ఉదయం విశాఖ బీచ్‌రోడ్డులో సందడి చేశారు. తన తదుపరి ప్రాజెక్ట్ మిస్ పర్ఫెక్ట్ ప్రమోషన్లలో భాగంగా వైజాగ్ వలంటీర్లతో కలిసి వైఎంసీఏ వద్ద తీరాన్ని శుభ్రం చేశారు. జాతీయ పరిశుభ్రత దినోత్సవం పురస్కరించుకుని ఉదయం 6 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన బీచ్ క్లీనింగ్ కార్యక్రమంలో ఆమె ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిబ్రవరి 2న మిస్ ఫర్ఫెక్ట్ వెబ్ సిరీస్ రిలీజ్ అవుతుందని, అందరూ చూడాలని కోరారు. పరిశుభ్రత పట్ల అంకితభావం కలిగిన మహిళగా ఈ సిరీస్‌లో కనిపిస్తానన్నారు. విశాఖ నగరం ఎంతో సుందర నగరమని, ఈ నగరాన్ని మరింత పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. వైజాగ్ అంటే తనకు ఎంతో ఇష్టమని, ఎన్నో సూపర్ హిట్ సినిమాలు ఇక్కడే షూట్ చేశారని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలతో పాటు నగరాన్ని కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. బీచ్ క్లీనింగ్‌లో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. వందసార్లకుపైగా బీచ్ క్లీనింగ్‌లో పాల్గొన్న వలంటీర్లకు ఆమె జ్ఞాపికలు అందజేశారు.



బీచ్ క్లీనింగ్‌లో పాల్గొన్న లావణ్య త్రిపాఠి

చికెన్, చేపల దుకాణాలపై ఆరు కేసులు



మళ్లవీధిలోని మటన్ దుకాణంలో కాటాను పరిశీలిస్తున్న భాస్కర్

అనకాపల్లి: తూకంలో తేడాలు ఉన్న చికెన్, మటన్, చేపల దుకాణాలపై ఆరు కేసులు నమోదు చేసినట్టు జిల్లా తూనికలు, కొలతలశాఖ ఇన్‌స్పెక్టర్ బి.భాస్కర్ తెలిపారు. పట్టణం, మండలంలోని పలు దుకాణాల్లో కాటాలను ఆదివారం పరిశీలించినట్టు ఆయన చెప్పారు. పట్టణ పరిధిలోని గాంధీనగరంలో 2, గుండాలవీధి, మళ్లవీధిలో ఒక్కో దుకాణం, మండలంలోని తుమ్మపాలలో 2 దుకాణాలపై కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. దశల వారీగా జిల్లా వ్యాప్తంగా దాడులు నిర్వహిస్తున్నట్టు ఆయన చెప్పారు. ఎక్కడైనా సమస్యలు ఉన్నట్టయితే తమశాఖ కార్యాలయంలో కొనుగోలుదారులు సమాచారం ఇవ్వాలని సూచించారు. తూనికలు, కొలతలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు.

క్లుప్తంగా

గృహోపకరణాలు దగ్ధం



దగ్ధమైన ఫ్రిజ్ ఇతర పరికరాలు

రావికమతం: కొత్తకోట గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మారోజు నానాజి ఇంట్లో అగ్నిప్రమాదం జరిగింది. శనివారం అర్ధరాత్రి జరిగిన ఈ ప్రమాదంలో అతని ఇంట్లోని టీవీ, ఫ్రిజ్ ఇతర గృహోపకరణాలు పూర్తిగా కాలిపోయాయి. రాత్రి పది గంటలకు నిద్రించే సమయం వరకూ బాగానే ఉందని ఆపై ఎపుడో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు రావడంతో ప్రాణ భయంతో పరుగులు తీశామని సామాన్లు ఏవీ రక్షించుకోలేకపోయామని నానాజి దంపతులు వాపోయారు. ఈ ప్రమాదంలో రూ.లక్ష వరకూ ఆస్తి నష్టం జరిగినట్టు తెలిపారు.

విశ్రాంత ఉపాధ్యాయుడి ఇంటిపై దాడి

నర్సీపట్నం: అర్ధరాత్రి సమయంలో తన ఇంటిపై గుర్తు తెలియని దుండగలు దాడికి పాల్పడ్డారని శారదానగర్‌లో నివాసం ఉంటున్న విశ్రాంత ఉపాధ్యాయుడు గాడి శ్రీరామ్మూర్తి టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం రాత్రి తాము ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో 20 నుంచి 30 మంది వరకు దాడి తెగబడ్డారని, బయటకు వస్తే చంపేస్తామంటూ బెదిరించి ఇంటి ముందు ఉన్న విశ్రాంత షెడ్డును కూలగొట్టారని శ్రీరామ్మూర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు.

హక్కులతో పాటు బాధ్యతలూ గుర్తెరగాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఏయూక్యాంపస్: ప్రజలు తమ ప్రాథమిక హక్కులతో పాటు బాధ్యతలను తెలుసుకోవాలని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ నందిని అన్నారు. విశాఖ ఆర్.కె బీచ్ నుంచి వైఎంసీఏ వరకు ది ప్రో బోనో క్లబ్, డీఎస్ఎన్ఎల్‌యూ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అవర్ రైట్స్–అవర్ ఆబ్లిగేషన్స్'ర్యాలీలో ఆమె మాట్లాడారు. హక్కులు, బాధ్యతలపై ప్రజల్లో అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ ర్యాలీని నిర్వహించామన్నారు. న్యాయవాద వృత్తిలో అడుగిడే వారు సమాజానికి సేవ చేయడానికి ఆసక్తి చూపాలన్నారు. ప్రో బోనో క్లబ్ చైర్మన్ బి.వి.ఎస్.సునీత మాట్లాడుతూ ఎదుట వ్యక్తి హక్కు మన బాధ్యతగా నిలుస్తుందన్నారు. క్లబ్, లీగల్ సర్వీసెస్ సభ్యులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

సరియా.. సురక్షితం



సరియా జలపాతం వద్ద పర్యాటకుల సందడి



జలపాతం వద్ద బండరాళ్లను తొలగింపులో నిమగ్నమైన కూలీలు

ప్రముఖ పర్యాటక కేంద్రమైన సరియా జలపాతం వద్ద తరచూ జరుగుతున్న ప్రమాదాలకు పోలీసుశాఖ చెక్ పెట్టింది. సందర్శకులు ప్రమాదాలకు గురికాకుండా గ్రామస్తుల సహకారంతో తక్షణ రక్షణ చర్యలు చేపట్టి నివారించగలిగింది. పర్యాటకుల ప్రాణాలకు భద్రత కల్పించింది.

- జలపాతం వద్ద ప్రమాదాలకు చెక్ పెట్టిన పోలీసులు
- స్థానికుల సహకారంతో సొరంగాలు, ఊబి తొలగింపు
- బండరాళ్లతో పూడ్చివేత
- అనంతగిరి ఎస్‌ఐ రాము చొరవతో సమస్య శాశ్వత పరిష్కారం

అనంతగిరి: జిల్లాలో ప్రముఖ పర్యాటక ప్రాంతంగా అనతికాలంలో గుర్తింపు పొందిన సందర్శనీయ ప్రాంతాల్లో సరియా జలపాతం ఒకటి. ఇక్కడి ప్రకృతి అందాలు, జల సోయగాలను తిలకించేందుకు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ విదేశాల నుంచి భారీగా పర్యాటకులు వస్తుంటారు. ఇక్కడి జలపాతంలో ఊబి ఉన్నందున స్నానాలకు దిగిన వారు ప్రమాదాలకు గురై మృత్యువాత పడేవారు. ఇందుకు కారణాలపై అన్వేషించిన పోలీసు అధికారులు సమస్య శాశ్వత పరిష్కారంపై దృష్టి సారించారు. సుమారు ఏడాదిన్నరగా ప్రమాదాలకు అడ్డుకట్ట వేయగలిగారు.

ఆరున్నరేళ్లలో 40 మంది..

సరియా జలపాతం 2015లో బాహ్య ప్రపంచానికి పరిచయమైంది. అప్పటినుంచి సందర్శకులు భారీగా తరలివస్తున్నారు. గత ఆరున్నరేళ్లలో సుమారు 40 మంది వరకు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయారు. దీంతో పోలీసుశాఖ అప్రమత్తమైంది. ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశానికి వెళ్లకుండా హెచ్చరిక బోర్డులు, ఫెన్సింగ్‌ఏర్పాటు చేసింది. అయినప్పటికీ ప్రమాదాలు జరుగుతుండేవి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంపై పోలీసుశాఖ దృష్టి సారించింది. అప్పటిలో అడ్మిన్‌గా పనిచేసిన ప్రస్తుత ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు సీఐ రుద్రశేఖర్, ఎస్‌ఐ కరక రాము ప్రమాదాల నివారణ పరిస్థితులపై దృష్టి సారించారు. దీనిలో భాగంగా స్థానికులతో చర్చించారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై వారి నుంచి అభిప్రాయాలు తెలుసుకున్నారు.

ప్రమాదకర ప్రదేశాలు గుర్తింపు

జలపాతంలో ప్రమాదాలకు కారణమైన ప్రదేశాలను గుర్తించారు. స్నానాలకు దిగిన సందర్శకులు జలపాతంలో బండరాళ్ల దిగువున గల సొరంగం, ఊబిలో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయేవారు. బండరాళ్లను తొలగించి సొరంగం, ఊబి లేకుండా పటిష్ట చర్యలు చేపట్టారు. ఇందుకు సుమారు నాలుగు రోజులపాటు స్థానికుల సహకారంతో ఎస్‌ఐ ఆధ్వర్యంలో సిబ్బంది శ్రమించారు. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రమాదకర పరిస్థితులు ఉన్నందున జాగ్రత్తగా ఉండాలని సందర్శకులకు అప్రమత్తం చేసేలా వలంటీర్లను ఏర్పాటుచేశారు. ఏడాదిన్నరగా ఎటువంటి ప్రమాదాలు చోటుచేసుకోనందున పోలీసులకు స్థానికులు, సందర్శకులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

కమిటీగా ఏర్పాటు



పోలీసుశాఖ చొరవతో సరియా గ్రామమంతా కమిటీగా ఏర్పడింది. 11 మంది వలంటీర్లను నియమించింది. జలపాతం సందర్శనకు వచ్చే పర్యాటకుల నుంచి టికెట్ రూపంలో రూ.20 వసూలు చేస్తున్నారు. ఈ మొత్తంలో కొంత వలంటీర్లకు వేతనంగా చెల్లిస్తున్నారు. మిగిలిన మొత్తాన్ని గ్రామాభివృద్ధితోపాటు జలపాతం పారిశుద్ధ్య కార్యక్రమాలకు వెచ్చిస్తోంది. ఇప్పటివరకు సుమారు రూ.2 లక్షలు ఉంది.

– మహేశ్వరరావు, వలంటీర్, సరియా

ఎంతో సంతృప్తి



దూర ప్రాంతాలనుంచి సరియా జలపాతం సందర్శనకు వచ్చే పర్యాటకులకు అవగాహన లేక ప్రమాదాలకు గురయ్యేవారు. జలపాతంలోని ఊబి, సొరంగాల్లో చిక్కుకుని ప్రాణాలు కోల్పోవడం ఆవేదన కలిగించింది. ఉన్నతాధికారుల సహకారంతో సమస్య శాశ్వత పరిష్కారంపై దృష్టి సారించాం. స్థానికుల సహకారంతో ప్రమాదకర పరిస్థితులు నివారించగలిగాం. అప్పటినుంచి ప్రమాదాలు జరగక పోవడం ఎంతో సంతృప్తి నిచ్చింది.

– కరక రాము, ఎస్‌ఐ, అనంతగిరి

పోస్టుమార్టం కష్టాలకు మోక్షం

- రూ.35 లక్షలతో మార్చురీ భవన నిర్మాణం
- వేగవంతమైన పనులు
- చోడవరం సర్కిల్‌కు ఎంతో ప్రయోజనం



తుప్పల మధ్యన మార్చురీ గది



పిల్లర్ల దశలో నూతన భవన నిర్మాణం

చోడవరం రూరల్: పోస్టుమార్టం కష్టాలకు త్వరలో మోక్షం కలగనుంది. రూ.35 లక్షలతో చోడవరంలో మార్చురీ భవనం నిర్మిస్తున్నారు. గత డిసెంబర్‌లో సంభవించిన మిచాంగ్ తుపాను కారణంగా ఈ పనులు మందగించినా ప్రస్తుతం వేగవంతమయ్యాయి. చోడవరం పోలీస్ సర్కిల్ పరిధి ఆరు మండలాల పోలీస్ స్టేషన్లలో నమోదయ్యే మెడికో లీగల్ కేసు(ఎంఎల్‌సీ)ల్లో మృతదేహాలకు పోస్టుమార్టం చేయాల్సి వస్తే సంబంధీకులకు చచ్చేంత పనే. గతంలో చోడవరం మార్చురీకి తరలించేవారు. ఇక్కడ ఆ గది కాస్త శిథిలమైంది. దీని చుట్టూ పెరిగిన పిచ్చి తుప్పలు, ముళ్లపొదల్లో అధ్వానంగా తయారు కావడంతో పోస్టుమార్టం చేయడం నిలిపివేశారు. దీంతో కొన్నేళ్లుగా మృతదేహాలను అనకాపల్లి ఎన్టీఆర్ ప్రాంతీయ వైద్యాలయానికి తరలిస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం తీసుకురావడం తల ప్రాణం తోకకు వచ్చినంత పనవుతోంది. ఈ నేపథ్యంలో చోడవరం వైద్యాధికారి వినయ్‌కుమార్ ఉన్నతాధికారులకు పోస్టుమార్టం గది పరిస్థితి, ఆవశ్యకతను నివేదించడం, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ కృషి ఫలితంగా రూ.35 లక్షలు మంజూరయ్యాయి. వీటితో నర్సీపట్నానికి చెందిన కాంట్రాక్టర్ కర్రి గంగాధర్ భవన నిర్మాణ పనులను ప్రారంభించాడు. ప్రస్తుతం పిల్లర్ల దశలో భవన నిర్మాణం ఉంది. ఒకట్రెండు నెలల్లో పూర్తి చేయాలన్న లక్ష్యంగా పనిచేస్తున్నామని పర్యవేక్షణాధికారి వేపాడ అప్పారావు తెలిపారు. నూతన భవనంలో మృతదేహాలను భద్రపరిచే కోల్డ్ స్టోరేజీ గది, వైద్య సిబ్బంది దుస్తులు మార్చుకునేందుకు ఒక గది, పోస్టుమార్టం నిర్వహణకు వేరొక గది, బంధుగణం వేచి ఉండేందుకు ఒక గది నిర్మించనున్నారు. ఈ నిర్మాణం పూర్తయితే పోస్టుమార్టంకు అనకాపల్లి వంటి సుదూర ప్రాంతానికి తరలించే పరిస్థితి నుంచి విముక్తి లభిస్తుందని చెప్పవచ్చు.

మృతదేహాలను గౌరవించాలి..



మృతదేహాలను గౌరవించడం మన సంస్కృతి. అలాంటిది ఆరుబయట, తుప్పల మధ్య పడేసి, పోస్టుమార్టం చేయడం వంటివి వాటిని అగౌరవ పరచడమే. అందుకే శిథిల భవనం స్థానే నూతన భవన నిర్మాణానికి ప్రాధాన్యమివ్వాలని ఉన్నతాధికారులను కోరాను. ప్రభుత్వం రూ.35 లక్షలు మంజూరు చేసింది. త్వరలోనే మార్చురీ భవనం సిద్ధం కాగలదని ఆశిస్తున్నాను. ఈ నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంత వాసులకు కొంత వెసులుబాటు కలుగుతుంది.

– డాక్టర్ లక్కోజు వినయ్‌కుమార్, చోడవరం సీహెచ్‌సీ

విశాఖ జేసీగా మయూర్ అశోక్

- జీవీఎంసీ అదనపు కమిషనర్‌గా కె.ఎస్.విశ్వనాథన్
- అల్లూరి జేసీగా భావన



భావన



మయూర్ అశోర్



కేఎస్ విశ్వనాథన్

సాక్షి, విశాఖపట్నం: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రాష్ట్ర వ్యాప్తంగా ఐఏఎస్‌ల బదిలీ ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించింది. ఇందులో భాగంగా ఉమ్మడి విశాఖలోని పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖపట్నం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా కె.మయూర్ అశోక్ నియమితులయ్యారు. ప్రస్తుతం విజయనగరం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న మయూర్ అశోర్ మహారాష్ట్రలోని పూణేలో 1993లో జన్మించారు. ఐఐటీ ముంబైలో కంప్యూటర్ ఇంజినీరింగ్‌లో బీటెక్, ఎంఏ(పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్) చదివారు. 2018 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారిగా తొలుత బీహార్ కేడర్‌లో చేరారు. అనంతరం ఏపీ కేడర్‌కు వచ్చిన ఆయన 2021 జూన్‌లో విజయనగరం జిల్లా జేసీగా నియమితులయ్యారు. ప్రస్తుతం విశాఖ జేసీగా విధులు నిర్వర్తిస్తున్న కె.ఎస్.విశ్వనాథన్‌ను జీవీఎంసీ అదనపు కమిషనర్‌గా బదిలీ అయ్యారు. 2017 బ్యాచ్‌కు చెందిన విశ్వనాథన్ తొలుత అనంతపురం ట్రైనీ కలెక్టర్‌గానూ, కేంద్ర ఫుడ్‌ప్రాసెసింగ్ ఇండస్ట్రీ అసిస్టెంట్ కమిషనర్‌గానూ తర్వాత నర్సాపురం సబ్ కలెక్టర్, ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తించారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌లో పనిచేయడం ఇదే తొలిశారనీ.. ఇది ఛాలెంజ్‌గా స్వీకరిస్తానని విశ్వనాథన్ అన్నారు. అదేవిధంగా అల్లూరి సీతారామరాజు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా భావనను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2019 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన భావన ప్రస్తుతం వార్డు, గ్రామ సచివాలయాల అదనపు డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. అంతకు ముందు పార్వతీపురం సబ్ కలెక్టర్‌గా పనిచేశారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7గంటల నుంచి స్వర్ణపుష్పార్చన వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. 108 స్వర్ణసంపెంగలతో స్వామికి అష్టోత్తర శత నామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకుడు రఘునాథ్ , పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకుడు రాజీవ్‌లోచన్ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం 9.30గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై వేంచేయజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.
- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం గరుడసేవ ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో వెండి గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్టంపజేసి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

సరుగుడులో సందర్శకుల సందడి



జలపాతం వద్ద సందర్శకులు

నాతవరం: సరుగుడు జలపాతం వద్ద సందర్శకులతో సందడి నెలకొంది. ఆదివారం ఇక్కడ ఎత్తయిన రెండు కొండల మధ్యలోంచి జాలువారిన జలపాతంలో జలకాటాలు ఆడేందుకు పోటీ పడ్డారు. ఉమ్మడి విశాఖ, తూర్పుగోదావరి జిల్లాల నుంచి వాహనాల్లో తరలి రావడంతో ఈ ప్రాంతమంతా ఉదయం నుంచి సాయంత్రం వరకు నూతన శోభ సంతరించుకుంది. ఆటపాటలతో సందడి చేయడమే కాకుండా సంహపంక్తి భోజనాలు చేసి ఈ ప్రాంతంలో పచ్చని కొండల అందాలను తిలకించారు. పర్యటక శాఖ అధికారులు ఏర్పాటు చేసిన ప్రత్యేక షెడ్లలో చిన్నారులతో సరదాగా గడిపారు.

వృద్ధురాలి మృతిపై ఫిర్యాదు

కశింకోట: మండలంలోని ఈ.చౌడువాడ శివారు పాత కన్నూరుపాలెంలో వృద్ధురాలి మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ చేసిన ఫిర్యాదుపై ఆదివారం కేసు నమోదు చేసినట్టు సీఐ ఎం.వినోద్‌బాబు తెలిపారు. పాత కన్నూరుపాలేనికి చెందిన కన్నూరు మహాలక్ష్మి (63) అనారోగ్యానికి గురై శనివారం స్థానికంగా ప్రైవేటుగా తాత్కాలిక వైద్య సేవలు పొందింది. ఆదివారం ఆస్పత్రికి తీసుకెళ్లడానికి ప్రయత్నిస్తుండగా అకస్మాత్తుగా మృతి చెందింది. ఆమె తన కూతురి ఇంటి వద్ద ఉంటోంది. కూతురికి, మృతురాలి చెల్లి కుటుంబానికి మధ్య మనస్పర్థలు ఏర్పడి గొడవ పడ్డారు. ఈ నేపథ్యంలో తన పెద్దమ్మ మహాలక్ష్మికి సరైన వైద్యం అందించనందున మృతి చెంది ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తూ చెల్లి కుమారుడు సూరిబాబు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

క్యాన్సర్ నివారణకు సమగ్ర చికిత్స అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రమావత్ దేవ్

ఏయూక్యాంపస్: కాన్సర్ నివారణకు సమగ్ర చికిత్స అవసరమని మెడికవర్ హాస్పిటల్స్ క్యాన్సర్ చికిత్స విభాగం వైద్యులు, క్యాన్సర్ క్యూర్‌ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ రమావత్ దేవ్ అన్నారు. ఆదివారం ఉదయం బీచ్‌రోడ్డులోని ఒక హోటల్లో లింఫోమాపై ఏర్పాటు చేసిన వైద్యనిపుణుల సదస్సును ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ దేశ విదేశాల నుంచి వచ్చిన వైద్య నిపుణులు నూతన అంశాలను, ఆవిష్కరణలు, చికిత్స విధానాలను వివరించడం జరుగుతోందన్నారు. ప్రతీ ఇంట్లో క్యాన్సర్ రోగులు కనిపించే పరిస్థితి నేడు ఉందని, సంపూర్ణ చికిత్సను అందరూ తీసుకోలేక పోతున్నారన్నారు. పేద రోగులకు ప్రత్యేకంగా సహాయం చేయడానికి క్యాన్సర్ చికిత్స అందించే విధంగా తమ ట్రస్ట్ పని చేస్తోందన్నారు. ప్రత్యేక స్క్రీనింగ్ శిబిరాలు ఏర్పాటు చేసి రోగులను గుర్తిస్తున్నామన్నారు. గ్రామాల్లో సైతం అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. యూకే నుంచి విచ్చేసిన వైద్యులు వివేక్ రాధాకృష్ణ మాట్లాడుతూ నా నైపుణ్యాలను, జ్ఞానాన్ని అడ్వాన్స్ లింఫోమా రంగంలో పంచుకోవడానికి ఇక్కడకు రావడం జరిగిందన్నారు. రక్త క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. ట్రస్ట్ సైంటిఫిక్ అడ్వైజర్ డాక్టర్ సాయినాథ్ , డాక్టర్ అభిలాష్, డాక్టర్ సాహిత్య తదితరులు పాల్గొన్నారు.

కరోనా కేసులు నిల్

మహారాణిపేట: విశాఖలో కరోనా తగ్గుముఖం పట్టింది. కొద్ది రోజులుగా ఒక్క కేసూ నమోదు కాలేదు. సంక్రాంతి సందర్భంగా జనం రాకపోకలు ఎక్కువగా ఉండే నేపథ్యంలో భారీగా కేసులు నమోదవుతాయని వైద్యాధికారులు భావించారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా పలు ఆస్పత్రుల్లో ఏర్పాట్లు చేశారు. నాటి నుంచి నేటి వరకు ఒక్క కేసు నమోదుకాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. డిసెంబర్–జనవరి మధ్య మొత్తం 80 మందికి కరోనా సోకిందని వారంతా ప్రస్తుతం పూర్తిగా కోలుకున్నారని కరోనా పరీక్షల ఇన్‌చార్జి డాక్టర్ జగదీష్ ప్రసాద్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు.

పర్యాటక ప్రాంతాలకు సందర్శకుల తాకిడి



వంజంగి హిల్స్‌కు పోటెత్తిన పర్యాటకులు



చెరువులవేనంలో కిటకిటలాడుతున్న పర్యాటకులు

సాక్షి,పాడేరు: మండలంలో ప్రముఖ పర్యాటక కేంద్రమైన వంజంగి హిల్స్‌కు ఆదివారం భారీగా పర్యాటకులు తరలివచ్చారు.పొగమంచు, ప్రకృతి అందాలను వీక్షించారు. ఉదయం 11 గంటల వరకు అక్కడే ఉండి సందడి చేశారు.

డుంబ్రిగుడ: ప్రముఖ పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతం అందాలకు తిలకించేందుకు ఆదివారం భారీగా పర్యాటకులు తరలివచ్చారు. కుటుంబ సమేతంగా స్నానాలు చేస్తూ సందడి చేశారు.

బొర్రాకు పోటెత్తిన పర్యాటకులు

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలకు ఆదివారం పర్యాటకులు పోటెత్తారు.. శనివారం 8267 మంది పర్యాటకులు సందర్శించగా రూ.6.36 లక్షల ఆదాయం వచ్చింది. ఆదివారం 6607 మంది తిలకించగా రూ.5.50 లక్షల ఆదాయం వచ్చిందని మేనేజర్ గౌరీ శంకర్ తెలిపారు. అలాగే జిప్‌లైన్‌కు శని,ఆదివారం రెండురోజుల్లో సుమారు రూ.6 లక్షల మేర ఆదాయం వచ్చింది. కటికి, తాటిగుడ, సరియా, చిట్టంపాడు జలపాతాలు సందర్శకులతో కళకళలాడాయి. కాఫీ ప్లాంటేషన్, డముకు వ్యూపాయింట్ వద్ద పర్యాటకులు సందడి చేశారు.



తారబు జలపాతం వద్ద పర్యాటకుల సందడి



తాటిగుడ జలపాతం వద్ద పర్యాటకులు సందడి

తారబు జలపాతానికి పర్యాటకుల తాకిడి

ముంచంగిపుట్టు: తారబు జలపాతం అందరిని ఆకట్టుకుంటుంది. జిల్లాలోని ముంచంగిపుట్టు,పెదబయలు మండలాల సరిహద్దులోని జలపాతం అందాలు తిలకించేందుకు ఆదివారం భారీగా తరలివచ్చారు. రోజంతా ఉత్సాహంగా గడిపారు.

చెరువులవేనం కిటకిట

చింతపల్లి రూరల్: మండలంలో లంబసింగి చెరువులవేనం పర్యాటకులతో ఆదివారం కిటకిటలాడింది. మంచు అధికంగా కురవడంతో వచ్చిన పర్యాటకులు ప్రకృతి అందాలను తిలకించారు.



సుంకరమెట్ట కాఫీ ప్లాంటేషన వద్ద పర్యాటకులు



తరలివచ్చిన పర్యాటకులు



బొర్రాకు పోటెత్తిన పర్యాటకులు

క్లుప్తంగా

నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు

అనకాపల్లి : విద్యుత్ వినియోగదారుల అవగాహన సదస్సు (ఏపీఈఆర్సీ) ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకూ స్థానిక గవరపాలెం విద్యుత్ శాఖ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి 4.30 వరకు నిర్వహిస్తున్నట్లు అనకాపల్లి విద్యుత్‌శాఖ ఈఈ కె.రాజశేఖర్, ఏఈ శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులను సదస్సులో వివరించినట్లయితే పరిష్కరిస్తామన్నారు.

వచ్చే నెల 16న రథసప్తమి వేడుకలు

అనకాపల్లి : మండలంలోని రాజుపాలెంలో శ్రీ సూర్యనారాయణమూర్తి రథసప్తమి వేడుకలు ఫిబ్రవరి 16న నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు కొణతాల బాబూరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 14 ఉదయం 7 గంటలకు సూర్యనారాయణమూర్తి కల్యాణం, మధ్యాహ్నం 3 గంటలకు సారె ఊరేగింపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సహకారంతో జాతీయ రహదారి నుంచి రాజుపాలెం సూర్యనారాయణమూర్తి దేవస్థానం వరకూ రూ.1.50 కోట్లతో కొత్త రోడ్డు వేసినట్లు తెలిపారు.

భోగాదికి ఘన నివాళి


భోగాది రాధాకృష్ణ మూర్తి (ఫైల్)

అనకాపల్లి : స్థానిక నర్సింగరావుపేటకు చెందిన సీనియర్ జర్నలిస్ట్, మూర్తి గ్యాస్ ఏజెన్సీ అధినేత భోగాది రాధాకృష్ణమూర్తి (65) ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. గ్యాస్‌మూర్తిగా ఆయన ప్రసిద్ధి చెందారు. 1990లో ఆంధ్రభూమి పత్రికలో అనకాపల్లి రిపోర్టర్‌గా పని చేసి, ఏపీయూడబ్ల్యూజే అనకాపల్లి ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేయడంలో ఆయన కీలకపాత్ర పోషించారు. మూర్తి మృతికి వైఎస్సార్‌సీపీ ఏపీఐడబ్ల్యూఏ రాష్ట్ర చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నేతలు పలకా రాము, వెంపరాల శర్మ, జర్నలిస్టులు సంతాపం తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు నర్సింగరావుపేటలో మూర్తి స్వగృహం నుంచి అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

రైలు ఢీకొని యువకుడి మృతి


గురుమూర్తి మృతదేహం

అనకాపల్లి: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో రైలు పట్టాలు దాటుతున్న లక్ష్మీదేవిపేటకు చెందిన గురుమూర్తి (27) రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. దువ్వాడ జీఆర్పీ హెచ్‌సీ ఎస్.రమేష్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శనివారం పట్టణంలో గౌరపరమేశ్వరుల అమ్మవారి ఉత్సవాన్ని తిలకించి లక్ష్మీదేవిపేట పంట పొలాలు బ్రిడ్జి వద్ద పట్టాలు దాటుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. గురుమూర్తి నాలుగు నెలలుగా లక్ష్మీదేవిపేట పొలాల వద్ద పాకలో నివసిస్తున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టర్ నిమిత్తం స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

అనకాపల్లి సినిమాలు

గుంటూరు కారం	: రాజా
గుంటూరు కారం	: సత్యనారాయణ స్క్రీన్-1
హనుమాన్	: సత్యనారాయణ స్క్రీన్-2
నా సామిరంగ	: షిర్డీసాయి
సైంధవ్	: పర్తిసాయి
గుంటూరు కారం(రెండు షోలు)	
హనుమాన్	: వెంకటేశ్వర
నా సామిరంగ	: శ్రీసత్య
హనుమాన్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 51 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. 'ఎ' పాజిటివ్-2 యూనిట్లు, 'బి' పాజిటివ్-6 యూనిట్లు, 'ఒ' పాజిటివ్-35 యూనిట్లు, 'ఎబి' పాజిటివ్-5 యూనిట్లు, 'ఒ' నెగెటివ్-2 యూనిట్లు, 'ఎబి' నెగెటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 226 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 159 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.



ఇంత మంచి రోజులు వస్తాయనుకోలేదు..

నా పేరు నందవరపు సత్యవతమ్మ. నాకు 82 ఏళ్లు. రేబాక గ్రామంలో ప్రసుత్తం నేను, నా కూతురు మాత్రమే ఉంటున్నాం. ప్రతి నెలా రేషన్ బియ్యం ఇంటి దగ్గరకే వస్తున్నాయి. నా రేషన్ కార్డు చూపించి బియ్యం, సరకులు తీసుకుంటున్నాను. నా భర్త చాలా కాలం క్రితమే మరణించాడు. అప్పటి నుంచి రేషన్ కోసం డిపో వద్దకు వెళ్లి సరకులు తెచ్చుకోవడమే పెద్ద పనిగా ఉండేది. కాని ఇప్పుడు అలాంటివేమీ లేవు. ఒకటో తారీఖు నుంచి సరకులు ఇస్తున్నారు. జీవితంలో ఇలాంటి రోజులు వస్తాయని ఎప్పుడూ అనుకోలేదు. **ఏ సమస్య వచ్చినా వలంటీర్లు వస్తున్నారు.**

ఇంటికొచ్చి పింఛను ఇస్తున్నారు..

నాపేరు బొర్రా తిరుపతమ్మ. నాకు 68 ఏళ్లు. శంకరం గ్రామంలో ఉంటున్నాను. మా ఇల్లు ఊరికి దూరంగా ఉంటుంది. అయినా సరే వలంటీర్ ప్రతి నెల ఒకటో తారీఖున తెల్లవారే వచ్చి పింఛను ఇచ్చి వెళ్తాడు. ఈ నెల రూ. 3 వేలు ఇచ్చారు. గత ప్రభుత్వంలో రూ.వెయ్యి రూపాయలు ఇచ్చేవారు. దానికి ఊర్లో పంచాయతీ ఆఫీసుకు వెళ్లేసరికి పెద్దలైను ఉండేది. ఏ మధ్యాహ్నానికో, మరుసటి రోజు ఉదయానికో ఇచ్చేవారు. చాలా ఇబ్బందులు పడేదాన్ని. ఇప్పుడు అలాంటిదేమీ లేదు. నేరుగా వలంటీరే వచ్చి ఇస్తున్నాడు. జగన్ వచ్చాక రోజులు మారాయి. **నెలసరి అన్ని ఖర్చులకు పింఛను డబ్బు సరిపోతుంది.**



ఆనందాల లోగిళ్లు

సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి తమ లోగిళ్లు ఆనందంతో వెల్లివిరుస్తున్నాయని పేదలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో పింఛన్లకు, రేషన్ సరకులకు నానా అగచాట్లు పడే వారమన్నారు. జగనన్న అధికారంలోకి వచ్చాక ఇంటికొచ్చి సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని కొనియాడారు. తమ బాగోగులు చూసేందుకు సీఎం జగన్ వలంటీర్లను ఏర్పాటు చేయటం ఎంతో మేలు చేసిందన్నారు.


డిపో వద్ద రేషన్ కోసం ఎదురు చూస్తున్న కార్డుదారులు (నాడు)


ఇంటి ముందుకొచ్చి రేషన్ సరకులు అందజేస్తున్న సిబ్బంది (నేడు)

- సీఎం జగన్ వచ్చాకే తమ బతుకులు బాగున్నాయని పేదల హర్షం
- పింఛన్, రేషన్ కోసం పడిగాపులు తప్పాయని ఆనందం

తుమ్మపాల : అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో అందిస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తూ పేద, మధ్య తరగతి ప్రజల మన్ననలు అందుకుంటున్నారు. విద్య, వైద్యం, మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నారు. ముఖ్యంగా ప్రజల లోగిళ్లలోకి వెళ్లి రేషన్ సరకులు అందజేస్తున్నారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే నాటి ప్రభుత్వ హయాంలో పెన్షన్లకైనా.. రేషన్‌కైనా లబ్ధిదారులు నానా అగచాట్లు పడేవారు. జన్మభూమి కమిటీ చెప్పిన వారికే పథకాలు అందేవి. మిగిలిన వారికి చుక్కలు చూపించేవారు. అవ్వాతాతలు, వితంతువులు, వికలాంగులకు కూడా పెన్షన్లు సవ్యంగా అందేవి కాదు. ఏ సాయంత్రానికో, రాత్రికో పింఛన్ ఇచ్చేవారు. రేషన్ కావాలంటే తెల్లవారే లైన్లో నిల్చోవాలి. టీ, టిఫిన్, చద్దన్నం తినడానికి కూడా లేకుండా క్యూలో నిల్చుంటేనే రేషన్ అందేది. లేదంటే అంతే సంగతులు. రేషన్ కావాలంటే ఆ రోజు కూలి పని మానుకోవల్సిందే. పింఛన్ కావాలన్నా అదే దుస్థితి. బిక్కుబిక్కుమంటు బతికిన ఆ రోజులు మళ్లీ వద్దంటూ అవ్వాతాతలు వాపోతున్నారు.


పింఛన్ కోసం పడిగాపులు పడుతున్న వృద్ధులు, వితంతువులు (నాడు)

గౌరవప్రదంగా..

సీఎం జగన్ ప్రభుత్వంలో అవ్వాతాతలు రారాజులుగా బతుకుతున్నారు. ఒకరిపై ఆధారపడకుండా వారికి నెలసరి జీతంలా ఒకటో తారీకున పింఛన్ వస్తోంది. వలంటీర్ ఇంటికొచ్చి తలుపు తట్టి రూ.3 వేలు ఇస్తున్నారు. దీంతో అవ్వాతాతల మోముల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. అలాగే రేషన్ సరకులు కూడా ఇంటి వద్దకే వస్తున్నాయి. నిమిషాల్లో సరకులు అందించి వెళ్లిపోతున్నారు. గతంలోలా లైన్ కట్టి ఉపాధి కోల్పోయే అవసరం లేకుండా సరకులు దొరుకుతున్నాయి. పథకాల సమాచారం వలంటీర్లు ఇంటికొచ్చి చెబుతున్నారు. బ్యాంకుల్లో నేరుగా నగదు పడిందని చెప్పగానే నగదు తెచ్చుకుని అవసరాలు తీర్చుకుంటున్నారు.


బొర్రా తిరుపతమ్మకు ఇంటికొచ్చి రూ.3వేలు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ (నేడు)

8 తులాల బంగారం చోరీ

అనకాపల్లి: గవరపాలెం పార్కు సెంటర్‌లో నివసిస్తున్న కర్రి లక్ష్మీనారాయణమ్మ మెడలో నుంచి 8 తులాల బంగారం తాడు చోరీకి గురైనట్లు పట్టణ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు అందింది. పట్టణ సీఐ జి.శంకరరావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 26న నారాయణమ్మ ఇంటిలో టీవీ పని చేయడం లేదని కేబుల్ ఆపరేటర్ గోవింద్‌కు ఫోన్ చేయగా.. ఆయన రాత్రి 7 గంటలకు వచ్చి కేబుల్ సరిచేసి వెళ్లిపోయాడు. అదే రోజు రాత్రి నారాయణమ్మ కుమార్తె నాగచంద్రిక, అల్లుడు మురళీ.. గౌరీపరమేశ్వరులను దర్శించుకుని ఇంటివచ్చి చూసేసరికి నారాయణమ్మ నేలపై పడిపోయింది. హుటాహుటిన స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి అక్కడ నుంచి విశాఖ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. నారాయణమ్మ కుమారుడు కిషోర్‌కుమార్ ఇంటిలో సీసీ పుటేజీల ఆధారంగా పట్టణ పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి తీర్థం

కశింకోట : మండలంలోని సోమవరం గ్రామంలో ఆదివారం ఆంజనేయస్వామి తీర్థ మహోత్సవం ఘనంగా జరిగింది. చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు ఉత్సాహంగా హాజరయ్యారు. స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. సర్పంచ్ గొంతిన నాగరత్నం, మాజీ సర్పంచ్ గొంతిన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

30న ఎడ్లబళ్ల పోటీలు

మాడుగుల రూరల్: మండలంలో సాగరం పంచాయతీ శివారు వాడపాడులో ఈ నెల 30న సీతారాముల తీర్థం ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఎడ్ల బళ్ల పరుగు, ముగ్గుల పోటీలు నిర్వహిస్తామన్నారు. ఎడ్ల బళ్ల పోటీల్లో మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన వాటికి రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.2 వేల చొప్పున బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

జాలంపల్లిలో ఘనంగా రాములోరి తీర్థం

మాడుగుల: జాలంపల్లిలో రాములోరి తీర్థం ఆదివారం వైభవంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తీర్థంలో పంచదార చిలుకలు, నెయిచెక్కీలు హాట్‌కేకుల్లా అమ్ముడయ్యాయి.

ముగిసిన గౌరీ పరమేశ్వరుల మహోత్సవం


మహోత్సవంలో బాణసంచా మెరుపులు


ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

అనకాపల్లి : స్థానిక గవరపాలెం గౌరీపరమేశ్వరుల మహోత్సవం అంగరంగ వైభవంగా ఆదివారం తెల్లవారు జామున ముగిసింది. ఉత్తరాంధ్ర జిల్లాలో అత్యంత వైభవంగా కనీవిని ఎరుగని రీతిలో ఈ ఏడాది మహోత్సవానికి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు కుటుంబ సమేతంగా వేడుకలు తిలకించారు. నేలవేషాలు, స్టేజ్ ప్రొగ్రాంలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. పలు స్వచ్ఛంద సంస్థలు అమ్మవారి ప్రసాద వితరణ, మజ్జిగ, తాగునీటి సౌకర్యం కలిపించాయి. మందు గుండు సీతారామయ్య కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ బాణసంచాను ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కొణతాల సంతోష్ అప్పారావునాయుడు ప్రారంభించారు. మహోత్సవంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ వి.సుబ్బరాజు, పట్టణ సీఐ జి.శంకరావు భారీ బందోస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, కోశాధికారి కొణతాల మహాలక్ష్మీనాయుడు, నూకాంబిక అమ్మవారి దేవస్థానం చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పోటీ పరీక్షల పుస్తకాలు


పుస్తకాలు చదువుతున్న పాఠకులు

దేవరాపల్లి: స్థానిక గ్రంథాలయానికి జిల్లా గ్రంథాలయ సంస్థ నుంచి పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు వచ్చాయని గ్రంథపాలకుడు ఒ. శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. గ్రంథాలయ పాఠకుల డిమాండ్ మేరకు జియోగ్రఫీ, మెంటల్ ఎబిలిటీ, భారతీయ సమాజం, సైన్సు అండ్ టెక్నాలజీ, ఆధునిక ఆంధ్రప్రదేశ్ చరిత్ర, ఇంగ్లిషు మీడియానికి సంబంధించి ఇండియన్ పాలిటిక్స్ పుస్తకాలు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొండా రాజీవ్‌గాంధీ, కార్యదర్శి వెంకట్రావు అందజేశారన్నారు.

మెరుగైన నైపుణ్యంతో పోటీ పరీక్షల్లో విజయం


సమావేశంలో మాట్లాడుతున్న కె.ఎస్.రాజు


సమావేశానికి హాజరైన నిరుద్యోగులు

అనకాపల్లి : నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడంతో పోటీ పరీక్షల్లో విజయం సాధించవచ్చని కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్ (కాగ్) ఆఫ్ ఇండియా సీనియర్ ఆడిటర్ కె.ఎస్.రాజు అన్నారు. స్థానిక గవరపాలెం గౌరీ గ్రంథాలయంలో శ్రీధర్ సీసీఈ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాలపై ఆదివారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు సమయ పాలన, ఏకాగ్రతను మెరుగుపరుచుకోవాలని తెలిపారు. రైల్వే పరీక్షల కోసం ప్రిపరేషన్ స్ట్రాటజీ, పరీక్షా సరళి, ప్రాథమిక, సొల్యూషన్ పుస్తకాల ప్రాధాన్యతలను వివరించారు. శ్రీధర్ సీసీఈ ఫ్యాకల్టీ కె.సూర్య మాట్లాడుతూ భవిష్యత్‌లో స్టాఫ్ సెలక్షన్ కమీషన్, రైల్వే రిక్రూట్‌మెంట్, బ్యాంకు ప్రొబేషనరీ అధికారుల పోటీ పరీక్షలకు ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకట రమణ, సభ్యులు బొడ్డేడ జగ్గఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మండపానికి తుది మెరుగులు

- కశింకోటలో రూ. కోటీకి పైగా నిధులతో నిర్మాణం
- త్వరలో ప్రారంభోత్సవానికి సన్నాహాలు


విశాలంగా కల్యాణ మండపం హాలు


పంచాయతీ కార్యాలయం వద్ద ప్రారంభానికి సిద్ధమవుతున్న పెద్ద కల్యాణ మండపం

కశింకోట: కశింకోట పంచాయతీ కార్యాలయం వద్ద నిర్మిస్తున్న పెద్ద కల్యాణ మండపం ప్రారంభోత్సవానికి సిద్ధమవుతోంది. దాదాపు నిర్మాణం పూర్తయింది. తుది మెరుగులు దిద్దుతున్నారు. ఇది ప్రారంభమై వినియోగంలోకి వస్తే సరైన కల్యాణ మండపం లేని లోటు తీరనుంది. మండల కేంద్రమైన కశింకోటలో సుమారు 20 వేల జనాభా ఉన్నారు. అయితే ఇక్కడ కల్యాణాలు, ఇతర శుభ కార్యాలు నిర్వహించుకోవడానికి సరైన కల్యాణ మండపం లేదు. దీంతో వర్షాలు పడితే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్తోమత ఉన్న వారైతే అనకాపల్లి వంటి పట్టణ ప్రాంతాలకు వెళ్లి కల్యాణ మండపాల్లో వివాహాలు జరిపించుకుంటున్న పరిస్థితులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రజల కోరిక మేరకు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చొరవతో పరవాడలోని అరబిందో ఫార్మాసిటీ పరిశ్రమ ముందుకు వచ్చింది. కోటీ రూపాయలకు పైగా సీఆర్ఎస్ నిధులు వెచ్చించి స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద స్థలంలో అన్ని రకాల వసతులతో కల్యాణ మండపం నిర్మాణానికి గతేడాది శ్రీకారం చుట్టారు. తాజాగా పనులు పూర్తి కావచ్చాయి. తుది మెరుగులు దిద్దుకుంటోంది. అందంగా వేదికను నిర్మించారు. విశాలమైన ప్రాంగణాన్ని ఏర్పాటు చేసి అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నారు. గచ్చులు, తలుపులకు పాలిషింగ్, ప్రహరీ ఎత్తు చేయడం వంటి పనులు జరుగుతున్నాయి. మూడు, నాలుగు రోజుల్లో ఈ పనులు పూర్తి చేసి సత్వరమే ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. నామ మాత్రపు రుసుంతో ప్రజలకు అందుబాటులోకి తేవడానికి మంత్రి అమర్‌నాథ్ సంకల్పించారు. అందరికి అనువుగా గ్రామ నడిబొడ్డున నిర్మించిన కల్యాణ మండపం వినియోగంలోకి వస్తే శుభ కార్యాలు నిర్వహణకు ఇబ్బందులు ఉండవని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


తలుపులకు చేస్తున్న పాలిషింగ్ పనులు

పాడి రైతులకు ప్రోత్సాహకాలు


కొత్తపల్లిలో పాడి రైతులకు బకెట్లు అందజేస్తున్న సర్పంచ్ కన్నం శ్యాంసన్


అడ్డాంలో పాడి రైతులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న మలసాల రమణారావు

కశింకోట : మండలంలోని కొత్తపల్లి గ్రామ అమూల్ పాల కేంద్రంలో పాడి రైతులకు ప్రోత్సాహక బహుమతిగా ఆదివారం బకెట్లు అందజేశారు. ఎక్కువ పాలు ఉత్పత్తి చేసిన వారికి సర్పంచ్ కన్నం శ్యాంసన్ వీటిని పంపిణీ చేశారు.

దుప్పట్ల పంపిణీ..

విశాఖ డెయిరీ ఆస్పత్రిలో పాడి రైతులకు ఉచితంగా అందిస్తున్న వైద్య సేవల పరిమితిని రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షలకు పెంచారని, ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు కోరారు. మండలంలోని జి. భీమవరం, లాలం కొత్తూరు, అడ్డాం గ్రామాల్లోని పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాలకు చెందిన 175 మంది సభ్యులకు విశాఖ డెయిరీ ప్రోత్సాహక బహుమతులుగా అందజేస్తున్న దుప్పట్లను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాడి రైతుల సంక్షేమానికి విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారన్నారు. దీనిలో భాగంగా డెయిరీ ఆస్పత్రిలో పాడి రైతులకు అందించే వైద్య సేవల పరిధి రెట్టింపునకు చర్యలు తీసుకున్నారన్నారు. అధిక పాలు సరఫరా చేసిన రైతులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్నారన్నారు. ఆవుల కొనుగోలుకు వడ్డీ లేని రుణాలు ఇస్తున్నారన్నారు. ప్రతి పాల కేంద్రంలో పశువులకు వైద్య సేవలందించడానికి చర్యలు తీసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో డెయిరీ సూపర్‌వైజర్ కాయల సత్యనారాయణ, అడ్డాం సర్పంచ్ చేకూరి మహేశ్వరరాజు, పాల సంఘం అధ్యక్షుడు తురకల పూడి రాజబాబు, గుమ్మడి నారాయణ, పెనుమత్స సత్యనారాయణరాజు, అప్పలనాయుడు, పీఎస్‌లు జెర్రిపోతుల నూకినాయుడు, పచ్చికూర సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాలరాజులబాబుకు ప్రత్యేక పూజలు


బాలరాజులబాబుకు పూజలు చేస్తున్న భక్తులు

రోలుగుంట: అంట్లపాలెం కూడలిలోని బాలరాజులబాబు ఆలయంలో విగ్రహ ప్రతిష్ట ద్వితీయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు పాపంటపేట, కె.నాయుడుపాలెం, గుర్రంపేట తదితర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. కమిటీ సభ్యులు గుములూరి బాబూరావు, జి.ఈశ్వరరావు, అడిగర్ల రాజు, రొంగలి అప్పలనాయుడు, వానసెట్టి కృష్ణ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల సహకారంతో ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం ఇక్కడ చిడతలు, భజన పోటీలు నిర్వహించారు.

ఆశాజనకంగా జనుము పంట


రోలుగుంటలో జనుము పంట

రోలుగుంట: మండల రైతాంగం తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు వచ్చే సల్పకాలిక పంటలపై ఆసక్తి చూపుతోంది. దీనిలో భాగంగా జనుము సాగు విస్తారంగా చేపట్టింది. గతేడాది మండలంలో 400 ఎకరాల్లో సాగు చేయగా, ఈ ఏడాది 650 ఎకరాల పైబడి విస్తీర్ణం పెరిగింది. ఏ విధమైన నీటి తడుపు, వర్షాలు అవసరం లేకుండానే మంచు ఆధారంగా పంట చేతికొస్తోంది. ఎకరాకు రెండు బస్తాలు పైబడే దిగుబడులు వస్తాయి. రూ.5 వేలు పైబడి ఆదాయం వస్తుంది. ప్రస్తుతం పూత దశలో ఆశాజనకంగా ఉంది. మరో నెలలో పంట చేతుకొస్తుందని, కూలీలు అవసరం లేకుండా ఇంటిల్లిపాదికి పని సరిపోతుంది. దిగుబడులు, ఆదాయం బాగానే ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.